భద్రాద్రి రామయ్యకు రాజదండం

ఆలయ ఈవోకు రాజదండం అందిస్తున్న సద్గురు మధుసూదన్ సాయి

భద్రాచలం, డిసెంబర్ 14: భద్రాచలం సీతారామచంద్రస్వామిని కర్నాటక ముద్దేనహల్లి శ్రీమధుసూదన్ సాయి గ్లోబల్ హ్యూమటేరియన్ మిషన్ ఫౌండర్ సద్గురు మధుసూదన్ సాయి శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో రమాదేవి ద్వారా స్వామి వారికి రాజదండం అందించారు. దీనిని 114.65 గ్రాముల బంగారంతో చేయించారు. ముందుగా, స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయంలోని లక్ష్మీతాయారమ్మ, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

నిత్యావసర సరుకులు అందజేత

నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

చుంచుపల్లి, డిసెంబర్ 14 : తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్‌కాలనీ సారయ్యకాలనీలో ఉన్న నిరుపేదలకు శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆటో ప్రమాదానికి గురైన బొప్పి వెంకటేశ్వర్లుకు ఉమామహేశ్వరరావు, సుశీల దంపతులు రూ.2 వేల సరుకులు అందించారు. అసోసియేషన్ సభ్యుడు గడ్డం విజయమోహన్ 20కిలోల బియ్యం, నసీరుల్లా రూ.500 సాయం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, మైనేని నాగేశ్వరరావు, కామేశ్వరరావు, ధర్మారావు, మోహన్‌లాల్, రాజేంద్రప్రసాద్, గురుమూర్తి, సత్యానందం పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎంఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 14 : మున్సిపాలిటీ పరిధిలోని ఆనందఖని పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలకు శనివారం మండల విద్యాశాఖ అధికారి ప్రభుదయాళ్ క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ పాఠశాలను ప్రభుత్వం ప్రత్యేకంగా పాక్షిక అనాథ బాలుర కోసం నిర్వహిస్తున్నది. కలెక్టర్ ఈ పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఎంఈవోను తరచూ పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. ఈక్రమంలో శనివారం క్రీడా సామగ్రితోపాటు పేస్టులు, సబ్బులు, దుస్తులు అందించారు.

17న జిల్లా క్రాస్ కంట్రీ పోటీలు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 14 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన మంగళవారం సాయంత్రం 3గంటల నుంచి పాల్వంచ, చింతలచెరువు చెరువుపై జిల్లా క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే.మహీధర్ తెలిపారు. ఈ పోటీలు 16 సంవత్సరాలలోపు బాల బాలికలకు 2 కిలోమీటర్లు పరుగుపందెం, 18 సంవత్సరాలలోపు వారికి 6 కిలోమీటర్లు, 20 సంవత్సరాలలోపు వారికి 8 కిలోమీటర్లు, ఆపై వారికి 10 కిలోమీటర్లు పరుగుపందెం ఉంటుందన్నారు. గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని, ప్రతిభ చూపిన వారికి ఈ నెల 22వ తేదీన నాగర్‌కర్నూల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర క్రాస్ కంట్రీ పోటీలకు పంపుతామని పేర్కొన్నారు.

గనుల వద్ద సభ్యుల సమావేశం

అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామవరం, డిసెంబర్ 14 : కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ వోసీ సీహెచ్‌పీలోని ఉద్యోగుల సమావేశం శనివారం జరిగింది. ఏరియా ఇంజినీర్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సమావేశం కొత్తగూడెం ఏరియాలో జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గట్టయ్య, ఎండీ రజాక్, సుమలత, యోహాన్, సోమశేఖర్‌రావు, మురళి, కరీముల్లా, నాగభూషణం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు అరికట్టాలి

దమ్మపేట, డిసెంబర్ 14: మండలంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 80 కిలోల ధాన్యానికి ఐదు కిలోలు తరుగు తీస్తున్నారని, ఆంధ్రా నుంచి సన్న ధాన్యం తెప్పించి బోనస్ కాజేస్తున్నారని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు. నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సంచార తెగల సంఘం కమిటీ ఎన్నిక

చండ్రుగొండ, డిసెంబర్ 14: తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం జిల్లా కమిటీని శనివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఎస్‌డి బాద్‌షా, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, కార్యదర్శిగా ఖలీద్‌పాషా, సహాయ కార్యదర్శులుగా ఎస్‌డీ పీర్ మహమ్మద్, షేక్ మదార్, కోశాధికారిగా షేక్ వలీపాషా, నిర్వాహక కార్యదర్శిగా షేక్ అబ్దుల్ కరీం, గౌరవ సలహాదారుగా హఫీజ్ అబ్దుల్ జలీల్, మరో ఎనిమిదిమంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నిద్రపోతున్న నిఘా నేత్రాలు

- రూ.12 లక్షల ప్రజాధనం వృథా?
- పట్టించుకోని అధికారులు

పనిచేయకుండా ఉన్న సీసీ కెమెరాలు

రామవరం, డిసెంబర్ 14 : సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం టూ టౌన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నీరుగారడమే కాకుండా ప్రజాధనం రూ.12 లక్షలు వృథా అవుతున్నాయి. అప్పటి ఎస్పీ సునీల్‌దత్, డీఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలతో టూటౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌సీబీ నగర్ నుంచి రామవరంసెంటర్, గరీబ్‌పేట దారి వరకు, త్రీ ఇంక్లైన్ పంచాయతీ, 4 ఇంక్లైన్, రుద్రంపూర్, ధన్బాద్, పెనగడప పంచాయతీలోని అంబేద్కర్‌నగర్ వరకు సుమారు రూ.12 లక్షల వ్యయంతో 64 సీసీ కెమెరాలను ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. నేర నియంత్రణకు ఉపయుక్తంగా ఉంటాయని పోలీసులు వీటిని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దాతల సహకారంతో పెట్టించారు. వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేయడంతో గ్రామాల్లో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో తెలిసిపోయేది. కానీ అధికారులు బదిలీ కావడంతో ఇటు పోలీసులు వాటి నిర్వహణ పట్టించుకోకపోవడం, చాలా వరకు పనిచేయకుండా అలంకార ప్రాయంగానే ఉండిపోయాయి. దీంతో చోరీలు, ప్రమాదాలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంపూర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కెమెరాలు వైర్ తెగిపోవడంతో నిరుపయోగంగా మారింది. చాలాచోట్ల కెమెరాలు నేల చూపులు చూస్తున్నాయి. కొన్నిచోట్ల భారీ వాహనాలు తగిలి విరిగి కింద పడిపోవడంతో అవి కూడా చోరీకి గురయ్యాయి. ఇటీవల రుద్రంపూర్ జడ్పీ స్కూల్‌లో సుమారు 8 ఫ్యాన్లు చోరీకి గురయ్యాయి. రామవరం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రెండు ఫ్యాన్లు, ఎస్ఆర్‌టీ ఏరియాలో చోరీ, ఎస్‌సీబీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వైరింగ్ కేబుల్ చోరీలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిందితులను గుర్తించడం కష్టంగా మారుతోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సీసీ కెమెరాలు వాడుకలోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను వివరణ కోరగా... పాడైన, పని చేయని సీసీ కెమెరాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అధికారులు స్పందించాలి..

గతంలో పనిచేసిన టూటౌన్ ఎస్‌హెచ్‌వో బత్తుల సత్యనారాయణ కోరడంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయం అందించాం. రుద్రంపూర్, గౌతంపూర్ వర్తకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కొంత సొమ్మును అందజేశాం. సీసీ కెమెరాల వల్ల జరిగే ఉపయోగాలను దృష్టిలో ఉంచుకొని నిధులు సమకూర్చాం. కానీ ప్రస్తుతం చిన్నచిన్న సమస్యలతో కెమెరాలు పని చేయకుండా పోయాయి. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలి.

– అబ్దుల్ ఉమర్, రుద్రంపూర్

కెమెరాలను పునరుద్ధరిస్తాం..

గతంలో మొత్తం 54 సీసీ కెమెరాలను పునరుద్ధరించాం.. కానీ వర్షాలు, జాతీయ రహదారి విస్తరణ కారణంగా సీసీ కెమెరాల తీగెలు తెగిపోయి పనిచేయకుండా పోయాయి. మళ్లీ వాటి పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్నాం. సాధ్యమైనంత త్వరలో తిరిగి అవి పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– తొగటి రమేష్‌కుమార్, టూటౌన్ సీఐ

దేశానికి మన రైతులు ఆదర్శంగా ఉండాలి

- వ్యవసాయ కళాశాల వజ్రోత్సవంలో మంత్రి తుమ్మల

మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

అశ్వారావుపేట, డిసెంబర్ 14: దేశంలోని రైతులందరికీ ఆదర్శవంతంగా, మార్గదర్శకులుగా ఉండేలా మన రైతులు అభివృద్ధి సాధించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. కొన్ని పంటల సాగుపై అవగాహన కోసం ఇప్పటికే ఇతర రాష్ట్రాల రైతులు మన రాష్ట్రానికి వస్తున్నారని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవాలు స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం జరిగాయి. ముఖ్య అతిథి తుమ్మల మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖలోని ఖాళీలన్నింటినీ త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే అనుమతులు మంజూరు చేసినట్లు, ఆర్థిక శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందని చెప్పారు. వ్యవసాయాన్ని 'ఉద్యోగం'గా భావించే రోజులు వస్తాయన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ డాక్టర్ జె.సత్యనారాయణ, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి, ఐఐఓపీఆర్ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంవీ ప్రసాద్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దుర్మరణం

అనిల్‌కుమార్ (ఫైల్)

కానిస్టేబుల్ కుటుంబీకులను పరామర్శిస్తున్న డీఎస్పీ

మణుగూరు టౌన్, డిసెంబర్ 14: మణుగూరు మండలం తోగ్గూడెం వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతిచెందారు. మణుగూరు సుందరయ్య నగర్‌కు చెందిన అనీల్‌కుమార్, పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. రాత్రి వేళ బైక్‌పై వెళ్తున్న ఆయన, మణుగూరు తోగ్గూడెం ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. ఆయన బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్ పరిశీలించారు. మృతుడి భార్యను, కుటుంబీకులను డీఎస్పీ ఓదార్చారు.

256 ఆవాసాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా : ఎస్ఈ మహేందర్

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 14 : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధుల కింద ఇప్పటివరకు 256 ఎస్టీ ఆవాసాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా అందించామని కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మహేందర్ తెలిపారు. ఇందులో ప్రతిపాదించిన 267 ఎస్టీ ఆవాసాలకుగాను 256 పూర్తి చేశామని, మిగతా వాటికి అటవీ శాఖ నుంచి ఆమోదం పొందాల్సి ఉందని, ఎన్పీడీసీఎల్ గిరిజన పల్లెల్లో వందశాతం విద్యుద్దీకరణ పూర్తి చేయడానికి అనేక చర్యలు తీసుకుందని, మిగిలిన వాటికి అటవీశాఖ నుంచి అనుమతులు రాగానే యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తామన్నారు.

బీఎస్ఎన్ఎల్ అధికారుల లోక్ అదాలత్

లోక్ అదాలత్‌లో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ అధికారులు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 14 : జిల్లా కోర్టు ఆవరణలో బీఎస్ఎన్ఎల్ డిపార్ట్‌మెంట్ అధికారులు లోక్ అదాలత్ నిర్వహించారు. టెలిఫోన్ బిల్స్ బకాయిల పరిష్కారం కోసం బీఎస్ఎన్ఎల్ జిల్లా అధికారి ఆదేశానుసారం ఏవో ప్రేమలత, బీఎస్ఎన్ఎల్ ఏజీఎం సుభాష్, ఎస్‌డీ సక్రు, జేటీవో సందీప్, ఓఎస్ శివరాంజీ, జేఈ జైపాల్‌రెడ్డి, టీటీ నిరంజన్ , రాంకుమార్ పాల్గొన్నారు. ఈ లోక్ అదాలత్ ద్వారా సుమారు 50మంది కస్టమర్లు వారి బకాయిలు కట్టడంతో సుమారు రూ.లక్ష వచ్చాయని అధికారులు తెలిపారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

సారెకల్లు గ్రామంలో గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పాల్వంచ రూరల్, డిసెంబర్ 14 : మండలంలోని అటవీ సమీప ప్రాంతమైన సారెకల్లు పంచాయతీలోని ఆదివాసీ గిరిజనులకు పాల్వంచకు చెందిన జనహిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బేరా లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం 30మందికి దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఫౌండేషన్ సభ్యులు రెడ్డిపల్లి స్వప్న, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, ఉంద్రాతి రవి కొదుమూరి సత్యనారాయణ, యాకిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెనూను కచ్చితంగా అమలు చేయాలి

మెనూ గురించి వివరిస్తున్న ఎంఈవో శ్రీరామ్మూర్తి

పాల్వంచ రూరల్, డిసెంబర్ 14 : విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం యూనిఫాం డైట్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ఈ కార్యక్రమం కచ్చితంగా అమలయ్యేలా ఉపాధ్యాయులు, వార్డెన్‌లు చూడాలని ఎంఈవో శ్రీరామ్మూర్తి ఆదేశించారు. పట్టణంలోని బొల్లోరిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం డైట్ టైమ్ టేబుల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కీసర నాగేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 14 : గ్రూప్-2 పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు పూర్తిచేశారు. బందోబస్తు విధులకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ శనివారం తన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమీక్షలో పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు హాజరుకానున్న అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించాకే లోనికి అనుమతించాలని సూచించారు. 20మంది పోలీస్ అధికారులు, సుమారు 150మంది సిబ్బంది బందోబస్తు విధులకు హాజరుకానున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో ఏఆర్‌డీఎస్పీ సత్యనారాయణ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ టి. రమేష్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సివిల్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

సింగరేణి సీఎండీకి కథల సంపుటి

కథల సంపుటిని సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు అందజేస్తున్న రంగనాథ్

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 14: టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగనాథ్ రాసిన 'ప్రాణం తీసిన పైసలు' కథాసంపుటిని సింగరేణి సీఎండీ బలరాంకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ మాజీ సలహాదారుడు కేవీ రమణాచార్యులు శనివారం అందించారు. రచయిత రంగనాథ్‌ను సీఎండీ అభినందించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దిండిగాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 14: స్థానిక గురుకుల పాఠశాలను తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత లక్ష్యాన్ని అందుకునేందుకు చక్కగా చదువుకోవాలన్నారు. ఎంఈవో ఆనందకుమార్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు పంపిణీ

భద్రాచలం, డిసెంబర్ 14: భద్రాచలం పట్టణంలో 118 మంది నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ పంపిణీ చేశారు. వారికి ఇళ్ల తాళాలు ఇచ్చారు. తహసీల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో శ్రీనివాస్, ఆర్ఐలు నర్సింహారావు, బిక్కులాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 14: మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీలో 108 అంబులెన్స్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం ప్రారంభించారు. డాక్టర్ రాందాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి

మాట్లాడుతున్న ఏరియా జీఎం వీసం కృష్ణయ్య

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 14: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఉద్యోగులంతా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలని జీఎం వీసం కృష్ణయ్య కోరారు. ఆయన శనివారం కేవోసీలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో మాట్లాడారు. సంస్థ వినియోగదారుల నమ్మకాన్ని నిలుపుకోవాలన్నారు. జనరల్ మేనేజర్లు, అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, గోవింద్‌రావు, గిరిధర్‌రావు, నర్సింహరాజు, జీవీ మోహన్‌రావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో క్విజ్ పోటీలు

బూర్గంపహాడ్, డిసెంబర్ 14: మండలంలోని తాళ్లగొమ్మూరు సత్యనారాయణస్వామి ఆలయం(సత్యదేవుడు)లో శ్రీ గాయత్రీ జ్యోతిష్య కేంద్రం బాధ్యులు రెండవ దఫా క్విజ్ పోటీలను శనివారం నిర్వహించారు. సనాతన ధర్మం పురాణాలు ఇతివృత్తంగా సాగిన ఈ పోటీల్లో 220 మంది పాల్గొన్నారు. వరుసగా మూడు బహుమతులను జాదవుల అనూష, రేపాక అనూష, ముత్తవరపు నాగభవానికి కేంద్రం వ్యవస్థాపకుడు దేవులపల్లి సాయికిరణ్ శర్మ అందించారు.

అపార్ ఐడీ తప్పనిసరి

చర్ల, డిసెంబర్ 14: ప్రభుత్వ-ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు అపార్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో పరిటాల వెంకటరమణ అన్నారు.ఈ కార్డు ఉపయోగాలపై స్థానిక వాణీ విద్యానికేతన్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు శనివారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు మైనేని పద్మజ, ఉపాధ్యాయులు యాదగిరి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఇల్లెందు, డిసెంబర్ 14: స్థానిక ఆమ్ బజార్‌లో పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు.శనివారం పరిశీలించారు. కౌన్సిలర్లు పాబోలు స్వాతి, సయ్యద్ ఆజం, అను, సిరిమల్లె రాజు, ఎర్ర ఈశ్వర్, రేఖ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

17న వెల్ బేబీ షో

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 14: ఇల్లెందులోని వైసీవోఏ క్లబ్‌లో ఈ నెల 17న వెల్ బేబీ షో నిర్వహించనున్నట్లు సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల ఐదేళ్ల లోపు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఇమ్యూనైజేషన్ వివరాలు, ఐడెంటిటీ కార్డు తీసుకురావాలని వివరించారు.

వేజ్ బోర్డ్ మెంబర్‌కు సన్మానం

బూర్గంపహాడ్, డిసెంబర్ 14: సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ యారం పిచ్చిరెడ్డిని వేజ్ బోర్డ్ సభ్యుడిగా ప్రభుత్వం ఇటీవల నియమించింది. మండల పర్యటనకు శనివారం వచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. యారం పిచ్చిరెడ్డిని సన్మానించారు.

వ్యవసాయ పరిశోధన స్థానం సందర్శన

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 14: స్థానిక ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి శనివారం సందర్శించారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ డి.లక్ష్మీనారాయణ, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.కిరణ్, డాక్టర్ జి.విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, డిసెంబర్ 14: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు అర్చకులు శనివారం స్వర్ణతులసి పూజలు చేశారు. నిత్య కల్యాణమూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఆదివారం కృతిక దీపోత్సవం సందర్భంగా నిత్య కల్యాణం ఉండదని ఆలయ ఈవో రమాదేవి తెలిపారు.

రేపు సీఎం కప్ స్విమ్మింగ్ పోటీలు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 14 : సీఎం కప్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలను ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ హనుమంతరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సోమవారం ఉదయం 9గంటలకల్లా కొత్తగూడెంలోని ప్రగతిమైదానంలో హాజరుకావాలన్నారు. అనంతరం సీఈఆర్ క్లబ్ స్విమ్మింగ్‌పూల్ వద్ద స్విమ్మింగ్ పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి సీఎం కప్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 10 నుంచి 17 ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు మాత్రమే ఈ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

టేకు దుంగలు పట్టివేత

పట్టుబడిన టేకు దుంగలు

పర్ణశాల, డిసెంబర్ 14: మండలంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన చింతగుప్ప గ్రామంలో 11 టేకు దుంగలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బొలేరో(టీఎస్ 28 టీబీ 2486)ను శనివారం తెల్లవారుజామున అటవీ శాఖ రేంజర్ కమల పట్టుకున్నారు. వాహనం సహా దుంగలను భద్రాచలం అటవీ కార్యాలయానికి తరలించారు. ఈ దుంగల విలువ రూ.2.20 లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. డిప్యూటీ రేంజర్ శోభానాయక్, పర్ణశాల సెక్షన్ ఆఫీసర్ నందు పాల్గొన్నారు.